క్లుప్తంగా

భట్టిప్రోలులో 'సురక్ష' క్యాంప్ షెడ్యూల్

భట్టిప్రోలు: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో షెడ్యూల్ ఖరారు చేసినట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు ఆదివారం తెలిపారు. ఈ నెల 7న ఐలవరం-1, కోనేటిపురం, 11న ఐలవరం -2, సూరేపల్లి, 14న పెదలంక, గొరికపూడి, 18న పెదపులివర్రు, ఓలేరు, 21న భట్టిప్రోలు-1, వెల్లటూరు, 25న భట్టిప్రోలు-2, పల్లెకోన సచివాలయాలలో క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా రెండు బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తహసీల్దార్, ఈవోపీఆర్డీ, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్లతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కొల్లూరు : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దోనేపూడిలో సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఐ. సత్యనారాయణ రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున ఇంటింటికి వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తారని పేర్కొన్నారు.

భట్టిప్రోలులో గురుపౌర్ణమి వేడుకలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు సాయిబాబా మందిరంలో సాయినాథ-దత్తాత్రేయ స్వామి వార్ల గురు పౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, అష్టోత్తర పూజలు జరిగాయి. పూజా కార్యక్రమాలను వేద బ్రాహ్మణులు శాస్త్రయుక్తంగా నిర్వహించారు. శ్రీ సాయినామ ప్రచార కార్యక్రమంలో భాగంగా భక్తులు పురవీధులలో భిక్షాటన నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు తమ్మన రమేష్ బాబు, ఉపాధ్యక్షుడు బొలిశెట్టి బాలకృష్ణమూర్తి, బూర్లె విజయ్‌కుమార్, కొన్నిపాటి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మెంటా సాంబ శివరావు, సహాయ కార్యదర్శులు చన్నగిరి రాం బాబు(పాపారావు), కె. రవికుమార్, మాటూరి జగన్నాథరావు, కోశాధికారి బూర్లె కిరణ్ కుమార్ పాల్గొన్నారు. సోమవారం బాబాకు ఏకాదశ రుద్రాభిషేకం, అష్టోత్తర పూజలు జరుగుతాయని తెలిపారు.

నేడు సామూహిక శ్రీ సాయి వ్రతాలు

భట్టిప్రోలు: గురు పౌర్ణమి సందర్భంగా సోమవారం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంలో సామూహిక శ్రీ సాయి వ్రతాలు నిర్వహించనున్నట్లు అర్చకులు ధారా నారాయణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పాల్గొని, బాబా నామస్మారణతో పాద సేవ చేసుకుని కృతార్థులు కావాలని పేర్కొన్నారు. పూజా సామగ్రి ఉచితంగా అందచేయడం జరుగుతుందని తెలిపారు.

వైభవంగా రేణుక అంకమ్మ తల్లి కొలుపులు



కర్లపాలెం: పిట్లవారి వంశస్తుల కులదేవత శ్రీరేణుక అంకమ్మతల్లి కొలుపులు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. కర్లపాలెం పంచాయతీ ఎంవీరాజు పాలెంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో శ్రీరేణుక అంకమ్మతల్లి విగ్రహం ఇటీవల ప్రతిష్టించారు. అమ్మవారి కొలుపులను పిట్లవారి వంశస్తులు ఐదురోజుల పాటు అమ్మవారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగిస్తూ కన్నుల పండువగా జరిపారు. కొలుపులు ముగియటంతో అమ్మవారికి విశేష పూజలు చేసి, మొక్కులు చెల్లించారు.

ట్రాలీ బోల్తా.. మహిళకు గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ ట్రాలీ ఆటో బోల్తా పడటంతో మహిళకు తీవ్ర గాయాలైన ఘటన నారాకోడూరులో ఆదివారం జరిగింది. వేమూరు మండలం పోతుమర్రు గ్రామానికి చెందిన జి.రమణ తెనాలి నుంచి ట్రాలీలో చేపలను గుంటూరుకు తీసుకెళ్తున్నాడు. నారాకోడూరు గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో రమణకు తలకు తీవ్ర గాయమైంది. కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. బాధితురాలిని 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నృత్య కళాకారిణిలకు సన్మానం



తెనాలిఅర్బన్: తెనాలికి చెందిన గ్రీష్మశ్రీ, తహసీన్‌లను హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సన్మానించారు. దత్తాత్రేయ ఆహ్వానం మేరకు వీరు హైదరాబాద్‌లో నృత్య ప్రదర్శన ఆదివారం చేసినట్లు బాలికల తల్లిదండ్రులు అరుణకుమారి, షేక్ రఫీ, ఆలియాలు తెలిపారు. వీరికి శిక్షణ ఇచ్చిన గురువు నిర్మలా రమేష్‌ను అభినందించారు.

అర్హతే ప్రామాణికం.. ప్రజా సంక్షేమం ప్రాముఖ్యం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున



సంక్షేమ పథకాలను మహిళకు వివరిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు: సంక్షేమ పథకాల అమలులో వివక్షకు తావివ్వకుండా అర్హతే ప్రామాణికంగా, ప్రజా సంక్షేమమే ప్రాముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం నడుస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. ఆదివారం ఈపూరులో మూడొవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లిన మంత్రి మేరుగ నాగార్జున వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల రూపంలో ఒక్కో కుటుంబానికి అందిన లబ్ధిని వివరించి, బుక్‌లెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెనుకబడిన వర్గాలను ఆర్థికంగా ముందుకు తీసుకురావాలన్న లక్ష్యంతో సంక్షేమ పథకాలను అందజేస్తూ ప్రతి గడపలో ఆనందం వెల్లివిరిసేందుకు కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రజలందరూ రానున్న ఎన్నికల్లో మద్దతుగా నిలిచి, తిరిగి మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తే.. ఇంతకు మించిన సంక్షేమ పథకాలను అందజేస్తూ ప్రజల జీవన ప్రమాణాలను సీఎం మెరుగుపరుస్తారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, సర్పంచ్‌లు మంచాల వసుంధర, గుంటూరు నీలాంబరం, ఎంపీటీసీ సభ్యులు పడమట వెంకటలక్ష్మి, అమిరిశెట్టి శ్రీధర్, సుగ్గున అశోక్, జేసీఎస్ మండల ఇన్‌చార్జి అయిల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు సూర్యదేవర రామకృష్ణ, చిలకా ప్రకాశం, సింగం కృష్ణప్రసాద్, సుబ్బారెడ్డి, పి.కనక సుందరరావు, పిల్లి బుజ్జి, మంచాల సుదీర్, సుబ్బారావు, ఏమినేని శ్రీనివాసరావు, ఏమినేని శివన్నారాయణ, కొల్లి ప్రసాద్, పత్తిపాటి బోడెయ్య, తోడేటి రత్నాకర్, కనపర్తి మోహన్, గంట శివరంగారావు, బొర్ర నాగేశ్వరరావు, తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఐ.సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సార్డ్ సంస్థ సేవలు అభినందనీయం



విద్యార్థినికి బ్యాగ్, పుస్తకాలు అందజేస్తున్న డీపీవో రాంబాబు

కర్లపాలెం: సార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ విద్యార్థులకు చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కర్లపాలెం ఎంపీడీవో, బాపట్ల డీపీవో దాసరి రాంబాబు తెలిపారు. ఆదివారం కర్లపాలెం సార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 100 మంది విద్యార్థులకు సంస్థ ప్రతినిధి స్టీవ్ కొలిన్స్ ఆధ్వర్యంలో డీపీవో దాసరి రాంబాబు బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ చిన్నారుల తలరాతలు మార్చేది చదువేనన్నారు. స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులు అందిపుచ్చుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. సార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి స్టీవ్ కొలిన్స్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేస్తున్న కృషికి సపోర్ట్‌గా తమవంతుగా విద్యార్థులకు చేయూతనందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బన్నారావూరి శ్రీనివాసరావు, మోపర్తి జాన్ తదితరులు ఉన్నారు.

ఎంపీ ఆర్థిక సాయం అందజేత



రేపల్లె: గంగడిపాలేనికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు సైకం వెంకటేశ్వరరావు మృతి చెందారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు మృతికి గల కారణాలను ఫోన్‌లో కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సానుభూతి వ్యక్తం చేశారు. ఎంపీ సోదరుడు హరనాథబాబు మృతుని కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. ఎంపీ అందించిన రూ.70 వేల ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. సర్పంచ్ తిరుమలశెట్టి శివాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వంద మందికి ఉచిత వైద్య పరీక్షలు



డాక్టర్ చల్లా రామ్మోహన్‌రావును సన్మానించిన రామకృష్ణ సేవా సమితి ప్రతినిధులు

కర్లపాలెం: దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహాల మేరకు మందులు వాడాలని ప్రముఖ మధుమేహ వైద్యులు చల్లా రామోహన్‌రావు తెలిపారు. రామకృష్ణ సేవా సమితిలో ఆదివారం పేరలి నరసయ్య మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 100 మంది మధుమేహం, రక్తపోటు వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్స్ డే ను పురస్కరించుకుని రామకృష్ణ సేవా సమితి ప్రతినిధులు డాక్టర్ చల్లా రామోహన్‌రావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు తిమ్మరాజు వెంకటసుబ్బారావు, సమితి వ్యవస్థాపకులు కాటూరి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఆరె వెంకటేశ్వర్లు, జిడుగు వెంకటేశ్వర్లు ఉన్నారు.

గుంటూరు వెళ్లి.. పింఛన్ నగదు ఇచ్చి



నగరం: మండలంలోని అల్లపర్రు గ్రామానికి చెందిన అల్లపర్తి సీతారావమ్మ గుంటూరులోని ప్రవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ కర్రా ఆశారాణి ఆదివారం వైద్యశాలకు వెళ్లి సీతారావమ్మకు వృద్ధాప్య పింఛను నగదు ఇచ్చింది.

'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయండి

–ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ



మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ, వేదికపై ఎమ్మార్పీస్ నాయకులు

నగరం: ఎస్సీ వర్గీకరణ జరిగేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చెప్పారు. మండలంలోని సజ్జావారిపాలెంలో ఆదివారం జరిగిన నియోజవర్గ ఎమ్మార్పీఎస్ విస్తృత స్థాయి సమావేశంలో మందకృష్ణ మాదిగ పాల్గొని, మాట్లాడారు. హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఈ నెలాఖరులో చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కూచిపూడి ప్రసాదరావు, చందోలు దేవదాసు, చక్రపాణి, రమేష్, కిషోర్ పాల్గొన్నారు.

రెండు ఇళ్లు దగ్ధం..రూ.4 లక్షల ఆస్తి నష్టం



నగరం: అగ్ని ప్రమాదంలో రెండు పూరిల్లు దగ్ధమైన ఘటన ఆదివారం చినమట్లపూడి గ్రామంలోని మండేవారిమాలపల్లిలో జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మండే భాగ్యరావు పూరింటికి మంటలు అంటుకున్నాయి. పక్కనే ఉన్న మండే వెంకటేశ్వరావు ఇంటికి కూడా వ్యాపించడంతో రెండు పూరిళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం తెలపడంతో మంటలను అదుపుచేశారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.4 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు రెవెన్యూ అధికారులు అంచనావేశారు.

'ఆహార వైద్యము' పుస్తకావిష్కరణ



ఆహార వైద్యము పుస్తకావిష్కరణలో ఆలపాటి రాజా, రాజకుమారి, సాయిలక్కరాజు

తెనాలి: పట్టణానికి చెందిన విశ్రాంత బ్యాంకు అధికారి, స్వరలయ వేదిక వ్యవస్థాపకుడు, రచయిత సాయి లక్కరాజు 30 ఏళ్ల సాహిత్య ప్రస్థానం సభను ఆదివారం ఉదయం స్థానిక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో నిర్వహించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ సీఈవో దైవాల సుబ్రహ్మణ్యేశ్వరరావు అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై, సాయి లక్కరాజు 10వ రచన 'ఆహార వైద్యము'ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటికాలంలో మనిషి ప్రకృతి నుంచి దూరంగా వెళుతున్నాడని చెప్పారు. ఏదైనా అనారోగ్యం కలిగితే అప్పటికప్పుడు తక్షణ ఉపశమనం కోసం చూస్తున్నాడని తెలిపారు. ఫలితంగా అనారోగ్యాలు, మందుల వాడకం ఎక్కువైందని చెప్పారు. సాయి లక్కరాజు 223 రకాల స్వల్పకాలిక వ్యాధులకు మన ఇంట్లో ఆహారంలో వినియోగించే పదార్థాలతో ఉపశమనం పొందవచ్చంటూ రాసిన పుస్తకం ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ వైద్యం ఎంతగా విస్తరించినా మనిషి రోజువారీ మందుల ఖర్చులు పెరిగాయని గుర్తుచేశారు. దీనికి పరిష్కారంగా సాయి లక్కరాజు వంటింటి పదార్థాలతోనే అనేక బాధల నుంచి ఉపశమనం పొందే వైనాన్ని చక్కగా సరళమైన భాషలో రాయటం సంతోషంగా ఉందన్నారు. పలు రోగాలనూ నివారించుకోవచ్చని చెప్పారు. పుస్తకాలనూ, మొక్కలను బహుమతిగా ఇవ్వటం నేర్చుకోవాలని సూచించారు. సాయి లక్కరాజు మాట్లాడుతూ 30 ఏళ్ల కిందట తన తొలి కవిత ఇదే నెలలో ప్రచురితమైందని గుర్తుచేసుకున్నారు. పది పుస్తకాలు రాసినా, ఆవిష్కరణకు వెళ్లటం ఇదే తొలిసారిగా చెప్పారు. ఆహార వైద్యము పది మందికీ ఉపయోగపడాలనే ఉద్దేశంతోనే ఇందుకు పూనుకున్నట్టు చెప్పారు. రోగనిరోధక శక్తినీ ఇంట్లోని వస్తువులతోనే పెంచుకోవచ్చని చెప్పారు. రాయపాటి ప్రేమ్‌కుమార్ స్వాగతం పలికారు.

ఘనంగా రక్షణ సైన్య ప్రార్థన మందిర వ్యవస్థాపక దినం

తెనాలిఅర్బన్: ఐతానగర్‌లోని రక్షణ సైన్యం ప్రార్థన మందిర వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. చర్చి ముందు ఏర్పాటు చేసిన సంస్థకు చెందిన జెండాను ఎగురవేశారు. మేజర్ వి.యేసుపాదం మాట్లాడుతూ రక్షణ సైన్య ప్రార్థన మందిరాన్ని జనరల్ విలీయం, కేథారిన్‌లు లండన్‌లో 1965 జూలై రెండున ప్రారంభించినట్లు చెప్పారు. మేజర్ వి.ప్రశాంతకుమారి, మేజర్ పి.నాగరాజు, పి.రత్నసుందరి పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో శరీరంలో పలు మార్పులు



డాక్టర్ విజయసాగర్‌కు సత్కారం

తెనాలి: వాకర్స్ క్లబ్, తెనాలి జూలై నెల సమావేశం ఆదివారం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా ఫిజియోథెరపిస్టులు డాక్టర్ జి.విజయసాగర్, డాక్టర్ జి.దీప్తి హాజరయ్యారు. 'ఫిజియోథెరపీ– ప్రాముఖ్యత'పై డాక్టర్ విజయసాగర్ ప్రత్యేక ప్రసంగం చేశారు. వయసు పెరిగి వృద్ధాప్యం వచ్చేటప్పటికి శరీరంలో అనేక మార్పులు వచ్చి కండరాలు, నరాలు, కీళ్లు, ఊపిరితిత్తులు పని చేయటం తగ్గుతుందని చెప్పారు. స్వల్పమైన వ్యాయామాలతో దీనిని నివారించే అవకాశం ఉందన్నారు. అనంతరం ఆయన్ను సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. కార్యదర్శి కడియాల రవిబాబు స్వాగతం పలికిన సభలో సభ్యులు నరేంద్ర, సాంబశివరావు, కుమార్, రంగారావు, గోపాలరావు ప్రభృతులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి మహోత్సవం



తెనాలిటౌన్: పట్టణ ఐతానగర్‌లోని షిరిడిసాయి మందిరంలో గురుపౌర్ణమి మహోత్సవ వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మందిరంలో లిల్లీపూలతో సాయిబాబాకు అష్టోత్తరం చేశారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి అఖండ ఏక నామ సంకీర్తన జరిపారు. ఓంసాయి శ్రీ సాయి జయ జయ సాయి అంటూ సంకీర్తన చేశారు. అనంతరం 108 మందితో శత కలశపూజ జరిపారు. సాయంత్రం ఆరు గంటలకు 108 కలశములతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం ఉదయం మందిరం ఆవరణలో అన్నదాన కార్యక్రమం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

శాకంబరిదేవిగా కన్యకాపరమేశ్వరి



ప్రత్యేక అలంకారంలో కన్యకాపరమేశ్వరి



శాకంబరిగా అమ్మవార్లు

కొల్లూరు : ఆషాఢమాసం గురు పౌర్ణమిని పురస్కరించుకొని కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని పండ్లు, కూరగాయాలు, పుష్పాలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకుడు గాడేపల్లి శివశర్మ, ఆలయ కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కర్లపాలెం: కన్యకాపరమేశ్వరి అమ్మవారు ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య మహిళలు, భక్తులు అలంకరణ చేసి, పూజలు నిర్వహించారు. ఆషాఢమాసంలో వచ్చే ఆషాడషష్టీ రోజున కన్యకాపరమేశ్వరి అమ్మవారిని పలు రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో శాకంబరిగా అలంకరణ చేసి పూజలు చేయటం ఆనవాయితీగా వస్తోందని ఆర్యవైశ్య మహిళలు తెలిపారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి పూజలలో భాగంగా ఇద్దరు కన్యలను పెండ్లి కుమార్తెలుగా అలంకరించి పాదపూజ చేసి, సారె బహూకరించారు. వాసవి క్వీన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు గ్రామంలో కొలువైన ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు ఆషాఢ మాసం సందర్భంగా ఆదివారం శాకంబరి దేవి అలంకరణ చేశారు. ఏటా ఆషాఢమాసం అమ్మవార్లకు శాకంబరి అలంకరణ క్రమం తప్పకుండా చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అమ్మవార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

ఘనంగా శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం

నగరం: జిల్లేపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మి పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. దిట్టకవి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రయుక్తంగా కల్యాణాన్ని జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో కల్యాణాన్ని తిలకించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. మండలంలోని ధూళిపూడి శివారు లుక్కావారిపాలెం గ్రామ దేవత శ్రీయల్లారమ్మ అమ్మవారికి ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. శాకంబరీదేవీగా అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు జరిపారు.

అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ



అంబేడ్కర్, వైఎస్సార్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న మేరుగ చందన్‌నాగ్

రైలుపేట(భట్టిప్రోలు): భట్టిప్రోలు రైలుపేటలో సంఘస్తులు, అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరెడ్డి విగ్రహాల ఏర్పాటుకు ఆదివారం నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మేరుగ చందన్ నాగ్ పాల్గొన్నారు. అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తున్న సంఘస్తులు, యువతను చందన్ నాగ్ అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్ దారా రవికిరణ్మయి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, ఉప సర్పంచ్ బూర్లె రామప్రసాద్, ఎంపీటీసీ గద్దె సుశీల, ఉపాధ్యాయులు పఠ్రె రవి, అంబేడ్కర్ యూత్ నాయకులు గద్దె కిషోర్, దొడ్డా ప్రదీప్, దారం శ్రీనివాసరావు, నాగరాజు, జగదీష్, వైఎస్సార్ సీపీ నాయకులు దారా చెన్నయ్య, దావూరి నాగమల్లేశ్వరరావు, మాతంగి రత్నకుమార్, తిరువీధుల బాలాజి పాల్గొన్నారు.

నగర శివారులో వ్యక్తి దారుణ హత్య



బాషా మృతదేహం

గుంటూరు రూరల్: నగర శివారులోని నిర్జన ప్రదేశంలో ఓ వ్యక్తి హత్యగురైన ఘటన నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసరావు వివరాల మేరకు.. మంగళగిరి రూరల్ మండలం కురగల్లుకు చెందిన షేక్ బాషా(38) నగర శివారులోని కృష్ణబాబు కాలనీలో అద్దెకు ఇల్లు తీసుకుని నివశిస్తున్నాడు. లారీలకు పెయింట్ వర్క్ చేస్తూ జీవిస్తున్నాడు. బాషాకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ క్రమంలో శనివారం రాత్రి, తెల్లవారు జామున ఓ ఫోన్ కాల్ రావడంతో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అనంతరం భవానిపురం శివారులో ప్లాట్ల వద్ద తీవ్రగాయాలతో శవమమై కనిపించాడు. ఉదయం స్థానికులు మృతదేహాన్ని చూసి నల్లపాడు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతదేహం పై తీవ్ర గాయాలు, గాట్లు ఉండటంతో హత్యకు కత్తులు వినియోగించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుని బంధువులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. స్నేహితుల మధ్య వివాదాలే హత్యకు కారణమా, లేక ఇంకా ఏవైనా వివాదాలున్నాయా? మద్యం మత్తులో జరిగిన వివాదంలో హత్య చేశారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీం ఆధారాలను సేకరించింది. ఘటన స్థలిలో సేకరించిన ఆధారాల ప్రకారం విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్

వడ్లమూడిలో కిలోన్నర గంజాయి స్వాధీనం



యువకుడిని అదుపులోకి తీసుకున్న ఎస్ఐ జి.వెంకటాద్రి, తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ

చేబ్రోలు: స్పిన్నింగ్ మిల్లు కార్మికులకు గంజాయిను విక్రయిస్తున్న యువకుడిను చేబ్రోలు పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన షేక్ ఆషీర్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గంజాయి సేవించటం అతనికి అలవాటుగా మారింది. ఈ క్రమంలో కొంత కాలం నుంచి గుంటూరు నుంచి గంజాయిను కొనుగోలు చేసుకొని నారాకోడూరు, చేబ్రోలు, వడ్లమూడి గ్రామాల్లోని స్పిన్నింగ్ మిల్లుల్లో పనిచేసే కార్మికులకు విక్రయిస్తున్నాడు. పోలీసులకు సమాచారం అందటంతో ఎస్ఐ జి వెంకటాద్రి ఆధ్వర్యంలో పోలీసులు పథకం ప్రకారం నిందితుడిని అరెస్ట్ చేశారు. వడ్లమూడి క్వారీ దేవస్థానం ప్రాంగణం వద్ద ఎస్ఐ జి వెంకటాద్రి, తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ వాహనాల తనిఖీ చేసే సమయంలో సైకిల్‌పై అనుమానస్పదంగా వెళ్తున్న ఆషీర్‌ను తనిఖీ చేయగా కిలోన్నర గంజాయిను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వంగవీటి పోరాటం స్ఫూర్తిదాయకం

తెనాలి: బడుగు బలహీనవర్గాలకు అండగా అనేక పోరాటాలు చేసిన వంగవీటి మోహనరంగా జీవితం స్ఫూర్తిదాయకమని యునైటెడ్ ఇండిపెండెంట్స్ విద్యార్థి సంఘం (యూఐ) రాష్ట్ర మాజీ అధ్యక్షుడు తుర్లపాటి సురేష్ అన్నారు. వంగవీటి రాధా రంగా స్మారక కాపు యువజన సేవాసమితి ఆధ్వర్యంలో ప్రచురించిన 'వంగవీటి చైతన్య రథ సారథులు' పుస్తకాన్ని ఆదివారం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఆవిష్కరించారు. పుస్తక రచయిత తుర్లపాటి సురేష్ మాట్లాడుతూ వంగవీటి మోహనరంగాతో తనకున్న అనుబంధాన్ని, ఆయన పోరాట స్ఫూర్తిని, నడిపిన ప్రజా ఉద్యమాలపై సోషల్ మీడియా సాక్షిగా తాను వ్యక్తీకరించిన జ్ఞాపకాలే ఈ పుస్తకమని చెప్పారు. ప్రచురించిన సేవా సమితి అధ్యక్షుడు తన్నీరు శివశంకర్ అభినందనీయులన్నారు. వంగవీటి రాధా రంగ కాపు యువజన సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తన్నీరు శివశంకర్ మాట్లాడుతూ రంగా ముఖ్యఅనుచరుడిగా, యూఐ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రంగాతో అత్యంత సన్నిహితంగా మెలిగిన తుర్లపాటి సురేష్ రచనలను పుస్తకంగా తీసుకొచ్చే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. వంగవీటి రాధా రంగా మిత్రమండలి వ్యవస్థాపకుడు చెన్నుపాటి తదితరులు పాల్గొన్నారు.